క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన కావలి బాలపీరుకు మంజూరైన రూ.56వేల సీఎం సహాయనిధి చెక్కును మంగళవారం ఎంపీటీసీ మిద్దె కృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ సాయిప్రసాద్‌గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయనిధితో పేద కుటుంబాలు కార్పొరేటు స్థాయి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారని అన్నారు. చెక్కు మంజూరు చేయించిన కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, మంజూరుకు కృషి చేసిన ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మనోహర్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవామృతం వాడాలి



వీపనగండ్ల: సహజసిద్ధంగా తయారైన జీవామృత ఎరువులను వాడడం వల్ల మొక్కలను పూర్తి స్థాయిలో సంరక్షించవచ్చునని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. మంగళవారం సంపత్‌రావుపల్లిలోని నర్సరీని ఆయన సందర్శించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మొక్కలకు సరైన నీటిని అందించాలని, అందుకు గ్రామంలోని ప్రజాప్రతినిధులు, పంచాయతీ వర్కర్లు బాధ్యత వహించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు కంటి పరీక్షలు చేయాలని ఆయన వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాబు, మెడికల్ క్యాంప్ ఆఫీసర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సంఘర్షన ర్యాలీని జయప్రదం చేయాలి

వనపర్తి: ఉపాధిహామీ పథకాన్ని విస్తరించాలనే డిమాండ్‌తో ఈనెల 5న పార్లమెంటు ఎదుట నిర్వహించే మజ్దూర్ కిసాన్ సంఘర్షన ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా నుంచి సీఐటీయూ నాయకులతో కలిసి ఢిల్లీకి బయల్దేరినట్లు ఆయన వెల్లడించారు. జిల్లా నుంచి ఇప్పటికే సుమారు 200 మంది రైలుమార్గాన ఢిల్లీకి వెళ్లినట్లు తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రశ్నించేందుకే ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని స్పష్టం చేశారు. తనతో పాటు జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, జిల్లా కోశాధికారి శారద, జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, నాయకులు శ్రీహరి, ఆర్‌ఎన్ రమేష్, రాము, నారాయణమ్మ, బుచ్చమ్మ తదితరులు ఢిల్లీకి బయల్దేరుతున్నామని పేర్కొన్నారు.

కబ్జాదారులపై చర్యలకు డిమాండ్



పెబ్బేరు: మండలంలోని గుమ్మడం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ సువర్ణమ్మ, అఖిల పక్షం కన్వీనర్ మహేందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కురుమన్న గ్రామస్తులతో కలసి ధర్నా నిర్వహించడంతో పాటు గ్రామంలోని రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని 197, 198 సర్వే నెంబర్‌లో గల గ్రామ కంఠం భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు గ్రామంలోని కొందరు వ్యక్తులపైన పట్టాలుగా మార్పిడి చేసి పాస్ పుస్తకాలు తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ పట్టాలను రద్దు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో హరిబాబు, చిన్నరాముడు, పెద్దలక్ష్మయ్య, నరసింహానాయుడు, చిన్న ఆంజనేయులు, వీరస్వామి, శాంతయ్య పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడపాలి

పెద్దకొత్తపల్లి: రోడ్లపై లైసెన్స్ ఉన్న ట్రాక్టర్లు, బొలేరాలు, ఇతర వాహనాలనే నడపాలని అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సాయిశృతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేని వాహనాలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లైసెన్స్‌లను ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణికులు సామర్థ్యానికి మించి ప్రయాణించవద్దని సూచించారు. కొల్లాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేశ్వరి, బాలసరస్వతి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పార్కు

- రూ. 50 లక్షలతో నిర్మాణం
- ఆహ్లాదాన్ని పంచుతున్న పూల మొక్కలు
- అందరిని ఆకర్షిస్తున్న అంబేద్కర్ విగ్రహం



పార్కులో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న మొక్కలు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కొల్లాపూర్ ప్రధాన చౌరస్తాలో గల ప్రభుత్వ భూమిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన అంబేద్కర్ పార్కు ప్రారంభానికి సిద్ధమైంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషితో జిల్లాలోని ఎక్కడా లేని విధంగా మున్సిపల్ జనరల్ నిధులు రూ.50 లక్షలు వెచ్చించి ప్రతిష్టాత్మకంగా పార్కు నిర్మాణం పూర్తి చేశారు.

స్థలం కబ్జాకు గురికాకుండా..

గతంలో చెలిమిల్ల గ్రామ పంచాయతీ శివారులో ఉన్న కొల్లాపూర్ ప్రధాన జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. పెబ్బేరు మున్సిపాలిటీలో చెలిమిల్ల గ్రామం విలీనం కావడంతో విగ్రహం చుట్టు ఉన్న విలువైన స్థలం రూ.కోట్లు పలుకుతుండడంతో అక్రమార్కుల కన్ను దానిపై పడింది. దీన్ని గమనించిన కొందరు వ్యక్తులు, దళిత సంఘాల నాయకులు అక్కడే పెద్ద పార్కు నిర్మించాలని మున్సిపాలిటీకి, మంత్రి నిరంజన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సహకారంతో జిల్లాలోనే సుందరమైన పార్కుగా తయారు చేయడంతో చూపరులను ఆకర్షిస్తోంది.

రకరకాల పూల మొక్కలు

అంబేద్కర్ పార్కులో పలు రకాలు పూల మొక్కలు, ఆహ్లాదాన్ని పంచే పచ్చని గడ్డి, వాకింగ్ ట్రాక్, సేద తీరేందుకు బెంచీలు, విద్యుత్ లైట్లు, పార్కు చుట్టూ ఎత్తైన ప్రహారీ, గ్రిల్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు పార్కు మధ్యలో పది అడుగుల ఎత్తు దిమ్మె నిర్మించారు. దానిపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని ఏర్పాటు కోసం పెబ్బేరుకు చెందిన దాత ఎద్దుల సుభాష్ రూ.2.50 లక్షలు వెచ్చించి ఫైబర్‌తో తయారు చేసిన 12 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

సుందరంగా ఉంది



పట్టణంలోని కొల్లాపూర్ ప్రధాన చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పార్కులో పచ్చని గడ్డి, పూల మొక్కలు, విద్యుత్ లైట్లతో ఆకర్షణీయంగా తయారు చేశారు. దీంతో కొల్లాపూర్, కర్నూల్ వైపు వెళ్లే వాహనదారులు కాసేపు సేద తీరేందుకు అనువుగా ఉంది.

– కారుపాకుల సువర్ణ, 4వ వార్డు కౌన్సిలర్

త్వరలో పార్కు ప్రారంభం



పెబ్బేరు ప్రధాన చౌరస్తా కొల్లాపూర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ పార్కులో అన్ని విధాలుగా హంగులు సమకూర్చాం. దీనికి మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు, ప్రజలు ఎంతో సహకరించారు. అలాగే జిల్లాలో ఎక్కడ లేని విధంగా అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. మంత్రి చేతుల మీదుగా ప్రారంభం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

– కరుణశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్

అప్రమత్తతతోనే క్షయ నివారణ



మదనాపురంలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

అమరచింత: అప్రమత్తంగా వ్యవహరించి తగిన ఆరోగ్య సూచనలు పాటించడంతో త్వరితంగా క్షయ నుంచి కోలుకునే అవకాశం ఉందని డాక్టర్ శరత్ అన్నారు. పట్టణంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డీఎంఆర్‌ఎం ట్రస్టు ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు మంగళవారం పౌష్టికాహారం అందించారు. ఈమేరకు మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రతి నెల క్షయ వ్యాధిగ్రస్తులకు డీఎంఆర్‌ఎం ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిసార్ అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా, జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో..

క్షయపై అవగాహన

మదనాపురం: తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం కళాజాతా బృందం ఆట పాటలతో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జన్ను పద్మావతి, సర్పంచ్ రాంనారాయణ, డాక్టర్ భవాని, ఆరోగ్య విస్తరణ అధికారులు రవీంద్రగౌడ్, ప్రమీల, సూపర్‌వైజర్ నర్మద, ఏఎన్‌ఎం విజయ్, ఆశా కార్యకర్తలు సుభాషిని, గౌరమ్మ, బృందం సభ్యులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

పాన్‌గల్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వహీద్ మాట్లాడుతూ రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీల వ్యవహారంపై హైదరాబాద్ ఎస్సెస్సీ బోర్డు కార్యాలయం ఎదుట యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపితే అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ అసమర్థతతోనే ప్రశ్నాపత్రాల లీకేజీలు కొనసాగుతున్నాయని, ఈ వ్యవహారంతో విద్యార్థులు ఆందోళనకు గురివుతున్నారని వాపోయారు. ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, మోహన్, గోపాల్, వెంకట్, రవి, మురారి, అశోక్, వేణు, శివశంకర్, లోకేష్, సాయి, వంశీ పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు రూరల్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై నిరసనగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి పిలుపు మేరకు మంగళవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నాగౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆశన్న, పురుషోత్తం యాదవ్, ప్రవీణ్‌కుమార్, ఇమ్రాన్, బాలకృష్ణ, శివకుమార్, ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'

వనపర్తి టౌన్: కంటివెలుగుతో ఎంతో మందికి చూపు వచ్చిందని మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కమిషనర్ విక్రమసింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కంటి పరీక్షలు చేయడానికి, కళ్ల అద్దాలకు అంటూ రూ.వేలల్లో వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ ఉచిత పథకంతో ప్రజలు ఉచిత కళ్లఅద్దాలు పొంది సంతోషంగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు, కౌన్సిలర్లు బండారు కృష్ణ, కాగితాల లక్ష్మీనారాయణ, విభూది నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దానేలు, సురేందర్, సయ్యద్, ఇంతియాజ్, ఆర్‌పీ జయమ్మ, డాక్టర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో కంటి పరీక్ష చేస్తున్న సిబ్బంది

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 127 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో 14 మందికి అద్దాలు పంపిణీ చేశామని, ఏడుగురికి అవసరమైన అద్దాల తయారీకి పంపించామన్నారు. తొమ్మిది మందిని ఆపరేషన్ అవసరం ఉన్న వారీగా గుర్తించామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్పీ జన్మదిన వేడుకలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం డీఎస్పీ బంటు కిషన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని శివలింగానికి డీఎస్పీ కిషన్‌తో అర్చకులు అభిషేకం చేయించారు. అనంతరం శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం కల్యాణ మండలంలో డీఎస్పీ అభిమానులు 75కిలోల భారీ కేక్‌ను కట్ చేయించి పూలమాలతో సత్కరించారు.



ఆయిల్‌పాం తోటపై అడవి పందుల దాడి

వీపనగండ్ల: మండలంలోని సంపత్‌రావుపల్లిలో సోమవారం అర్ధరాత్రి సర్పంచ్ మోజెర్ల రామేశ్వరావుకు చెందిన పామాయిల్ తోటలోకి అడవి పందులు చొరబడి మొక్కలను నాశనం చేశాయి. నెల రోజుల క్రితం తనకున్న కొద్దిపాటి పొలంలో ఆయిల్‌పాం మొక్కలను నాటగా.. వాటిలో దాదాపు 70 మొక్కలను నాశనం చేశాయని బాధితుడు తెలిపారు. ప్రభుత్వ పరంగా తమను ఆదుకోవాలని ఆయన కోరారు.

మంత్రికి కృతజ్ఞతలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల నుంచి కుంటివానితండా వరకు రూ.2.25కోట్ల నిధులతో బీటీ రోడ్డు మంజూరు చేయించిన వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి సర్పంచ్ సత్యంయాదవ్, తండా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

అమరచింత: ఆత్మకూర్ పట్టణంలోని నాల్గో వార్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మంగళవారం ప్రారంభించారు. వేసవిలో చలివేంద్రాలను నిర్వహించి ప్రజల దాహార్తిని తీర్చడానికి యువత ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంఘాలు వీలైనంత ఎక్కువగా చలివేంద్రాలను ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చాలని కోరారు.

బాధితుడికి ఆర్థికసాయం

వనపర్తి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన కార్యకర్త నరసింహ కుటుంబానికి ఆ పార్టీ జిల్లా నాయకుడు బాలకృష్ణ, సురేష్‌కుమార్ రూ.8 వేల ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నరసింహ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. పార్టీలో క్రియాశీల సభ్యత్వం ఉన్నందున రూ. 50 వేల మెడికల్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి



అమరచింత: మండల కేంద్రానికి తనిఖీ చేయడానికి వచ్చిన కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు వేర్వేరుగా సమస్యలపై వినతిపత్రాలు అందించారు. దుంపాయికుంటలో గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు పొజీషన్ చూపాలంటూ ఆరు నెలలుగా గుడిసెలు నిర్మించుకొని ఆందోళన చేస్తున్న లబ్ధిదారులకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలంటూ కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సౌకర్యా లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, మరుగుదొడ్లను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, వెంకటేష్, రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ ఉన్నారు.

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా ఫయాజ్

కొల్లాపూర్: సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎస్‌ఎండీ.ఫయాజ్ ఎన్నికయ్యారు. మంగళవారం కొల్లాపూర్‌లోని కేఎల్‌ఐ అతిథి గృహంలో సీపీఐ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్‌నర్సింహ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, ఆయన సమక్షంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిని ఎన్నుకున్నారు. ఫయాజ్ అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న బాల్యానాయక్

పాన్‌గల్: ఉపాధి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు పని ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను గిరిజన సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశంలో సరైన వసతులు లేక కూలీలు ఎండలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. నీడ కోసం టెంట్లు, నీటి వసతులు కల్పించాలని చట్టంలో ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని, లేనిచో కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. తండా పరిధిలో పనిచేసే ఉపాధి కూలీలకు తండా సర్పంచ్ శాంతమ్మ ఆధ్వర్యంలో నీడ, నీటి వసతి ఏర్పాటుకు ముందుకు రావడంపై కూలీలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ శాంతమ్మ, ఉప సర్పంచ్ బుజ్జమ్మ, పంచాయతీ కార్యదర్శి నర్మద, ఫీల్డ్ అసిస్టెంటు సోమ్లానాయక్, ఎస్‌ఎంసీ చైర్మన్ బాబునాయక్, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రాములోరి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అమరచింత: ఆత్మకూర్ మండలంలోని వీరరాఘవపురంలో మంగళవారం సీతారాముల కల్యాణ మహోత్సం కనులపండువగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం త్రయోదశి రోజు గ్రామంలోని ఆలయంలో రాములోరి కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట ఆలయంలో ఇదే రోజు రాములోరి కల్యాణం నిర్వహిస్తారని.. అదే ఆచారం ప్రకారం గ్రామంలో ప్రతి ఏడాది ఇదే రోజు నిర్వహిస్తామని సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటీశ్వర్, ఉప సర్పంచ్ శారద, సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ చైర్మన్ మాధవి, ఆరెపల్లి సర్పంచ్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్ధారణకు విద్యార్థులకు రక్త పరీక్షలు



పిన్నంచర్లలో చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి



చెలిమిల్లలో..

అమరచింత: ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు రక్త పరీక్షలను నిర్వహిస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ అన్నారు. ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఒకటి, రెండు తరగతులు చదువుతున్న చిన్నారుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈసందర్భంగా డాక్టర్ శరత్ మాట్లాడుతూ జాతీయ ఫైలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా వ్యాధి వ్యాప్తి తీవ్రతను గుర్తించే ట్రాన్స్‌మేషన్ అసెస్మెంట్ సర్వేలో భాగంగా పాఠశాలలకు వెళ్లి చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే ద్వారా సమాజంలో ఫైలేరియా వ్యాధి ఏస్థాయిలో ఉందో తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం హైమావతి పాల్గొన్నారు.

పెబ్బేరు: మండల కేంద్రంలోని చెలిమిల్లలో బోధకాల వ్యాధి నిర్మూలనకు మాంటిస్సోరి పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు స్థానిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహిస్తునట్లు వైద్యాధికారి ఏజీ లార్సన్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం చిన్నారుల నుంచి రక్త నమూనాలు సేకరించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేందర్‌గౌడ్, సూపర్‌వైజర్ వెంకటసుబ్బమ్మ, తిరుపతయ్య, ఏఎన్‌ఎం వెంకటమ్మ, టెక్నీషియన్ శిరీష పాల్గొన్నారు.

నర్సమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లుకు చెందిన నడిమింటి నర్సమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజనగరం రాజేష్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నాయకుల బృందం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కల్యాణలక్ష్మి చెక్కు అందుకోవడానికి వచ్చిన నర్సమ్మ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనకు బీఆర్‌ఎస్ బాధ్యత వహించాలని సూచించారు. మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మ్యాతర్ల జగదీష్ మాదిగ, రాములు, వెంకట్రాములు, ఆంజనేయులు, మిద్దె కురుమూర్తి, చెన్నయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈవిషయమై జెడ్పీటీసీ కృష్ణయ్య రూ.10 వేల ఆర్థికసాయం చేశారని, ఎమ్మెల్యేతో మాట్లాడి మరింత సాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మృతురాలి మనుమడు వెంకటేశ్ విలేకర్లకు తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

అమరచింత: ఆత్మకూర్, అమరచింత మండలాల్లో మంగళవారం జరిగిన ఎస్‌ఎస్‌సీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. ఆత్మకూర్ పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాల్లో 636 మంది విద్యార్థులకు 634 మంది విద్యార్థులు హాజరయ్యారు. అమరచింతలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 308 మంది విద్యార్థులకు అందరూ పరీక్షలకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఈఓ సురేష్ కుమార్, అమరచింత, ఆత్మకూర్ తహసీల్దార్లు సింధూజ, చాంద్‌పాషా, ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీఆర్పీ స్వామి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ రత్నం తెలిపారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మల్లికార్జున్

మదనాపురం: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని మంగళవారం మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ తహసీల్దార్ నరేందర్ పర్యవేక్షించారు. ఇక్కడ పరీక్షలు సజావుగా నడిచేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మంజునాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసే పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయని రేవల్లి మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం రేవల్లి మండలంలోని గొల్లపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ భాస్కర్‌రావు, అతడితో పాటు మరి కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మరింత మంది పార్టీలో చేరనున్నారని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ సేనాపతి, జెడ్పీటీసీ భీమయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు రఘుయాదవ్, రఘురాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాధితుడికి పరామర్శ

గోపాల్‌పేట మండలంలోని ఏదులకు చెందిన శివశంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని విషయం తెలుసుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి మంగళవారం ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు చెప్పినట్లు ఏదుల గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖిల్లాఘనపురం: మండలంలోని వెంకటాంపల్లికి చెందిన వేముల చెన్నయ్య సాగర్, లలిత, వేముల యాదయ్యసాగర్, చంద్రకళ, మంజిత్ సాగర్ హైదరాబాద్‌లో కూలి పని చేసుకుని జీవినం సాగుస్తున్నారు. సుమారు ఏడాది క్రితం వీరంతా హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన వెంకటాంపల్లికి వస్తుండగా ఓఆర్‌ఆర్ వద్ద వీరు ప్రయాణిస్తున్న కారును ఓ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వీరంతా తీవ్ర గాయాల పాలయ్యారు. పేదకుటుంబాలకు చెందిన వీరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. తమను ఆదుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని వారు అభ్యర్థించగా.. ఆయన కృషితో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.8.5 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి చెక్కులను అందజేశారు. ఇందులో మగవారికి రూ.2 లక్షలు, ఆడవారికి రూ.1.75 లక్షలు, బాలుడికి రూ.1లక్ష చొప్పున మొత్తం రూ.8.5లక్షల చెక్కులు అందజేశారు. ఇందుకు కృషిచేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీపీ కృష్ణానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, టీఆర్‌ఎస్ నాయకుడు పురుషోత్తంకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి